# కలం

kalamdaily.com

Follow on: Kalamtelugu

ప్రజల గళం...

మంగళవారం • 07-04-2026

పేజీలు: 4

360° SINGLE TOPIC

చదువులు-ఫీజులు




# ప్రైవేటు విద్యపై నో కంట్రోల్


## తెలంగాణ వచ్చి పుష్కరకాలమైనా ఆగని దోపిడీ

### నియంత్రణ చట్టం మాటలకే పరిమితం

### ఏటా 30% పైగా ఫీజులు పెంచుతున్న ప్రైవేటు సంస్థలు

### రోడ్డెక్కుతున్న తల్లిదండ్రులు.. సర్కారు చర్యలు శూన్యం

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీరు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్నట్లుగా తయారైంది. విద్యార్థుల సంఖ్యలోగానీ, ప్రమాణాల్లోగానీ, పాస్ పర్సంటేజీలోగానీ ప్రైవేటు స్కూళ్లతో సర్కారు స్కూళ్లు పోటీ పడలేకపోతున్నాయి. దాదాపు 27 వేల సర్కారు పాఠశాలలున్నా, మూడున్నర లక్షల మంది ఉపాధ్యాయులున్నా చదువుకునే విద్యార్థుల సంఖ్య మాత్రం 25లక్షల లోపే. ఏటేటా కుప్పలు తెప్పలుగా ప్రైవేటు పాఠశాలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 12 వేల ప్రైవేటు విద్యాసంస్థలుంటే అందులో చదివే విద్యార్థులు 38 లక్షల మంది. ఎన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టినా, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్సులు కట్టినా ప్రైవేటును నియంత్రించడంలో ప్రభుత్వాల కార్యాచరణ తూతూ మంత్రమే.




ఒక్కో విద్యార్థిపై సగటున సంవత్సరానికి లక్ష రూపాయలకంటే ఎక్కువే ఖర్చు చేస్తున్నామని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పారు. విద్యాశాఖ కూడా ఆయన దగ్గరే ఉన్నది. పేద పిల్లలను ఉచితంగా చదివిస్తున్నామని గర్వంగా చెప్పుకుంటున్నారు. కానీ తల్లిదండ్రులు మాత్రం ఫీజులు ఎక్కువైనా ప్రైవేటు స్కూళ్లకే సై అంటున్నారు. ప్రైవేట్ లో ఫీజులను నియంత్రించడంలో సర్కారు ఫెయిల్. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమైనా, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా దొందూ.. దొందే..! పొలిటికల్ లీడర్లు, పలుకుబడి ఉన్నవారే ప్రైవేటు స్కూళ్ళ యజమానులు కావడంతో సర్కారు నియంత్రణా చర్యలు శూన్యం.

డిగ్రీ కోర్సులకంటే ప్రైమరీ చదువుకే ఎక్కువ ఖర్చవుతున్నది. నర్సరీ చదివేవారికి రూ.30 వేల నుంచి 3 లక్షల దాకా ఫీజు. బడ్జెట్, స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ.. కేటగిరీని బట్టి వసూళ్లు. ఏ తరగతి అయినా ఫీజులు లక్షల్లోనే. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు యాక్టివిటీస్, యూనిఫామ్, బుక్స్, ట్రాన్స్‌పోర్ట్, బ్రేక్‌ఫాస్ట్/మీల్స్.. ఇలా రకరకాల పేర్లతో ప్రైవేట్ స్కూళ్లు పేదలు, లోయర్ మిడిల్ క్లాస్, మిడిల్ క్లాస్ ఫ్యామిలీలను దోచేస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల ఫీ'జులుం' ఆటకట్టించాలని పేరెంట్స్ అసోసియేషన్స్ ప్రతి సంవత్సరం ఆందోళనలు చేయడం ఆనవాయితీగా మారింది. చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు హామీలివ్వడమూ రొటీన్ ప్రాక్టీస్.

తెలంగాణ ఏర్పడి పుష్కరకాలమైనా ఫీజుల నియంత్రణ చట్టమే లేదు. ప్రైవేట్ మేనేజ్‌మెంట్లు ఏటా 10–30 శాతం చొప్పున ఫీజుల్ని పెంచుతూనే ఉన్నాయి. అత్యధిక ఫీజులున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. నర్సరీ నుంచి డిగ్రీ దాకా ఇదే తంతు. ప్రైవేటు విద్యాసంస్థల ప్రారంభోత్సవానికి స్వయంగా ముఖ్యమంత్రే వెళ్లడం దేనికి సంకేతం? ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు గురించి ప్రస్తావించి ప్రైవేటు స్కూళ్ల ఫీజుల గురించి మాట్లాడకపోవడం విడ్డూరం. ఫీజుల నియంత్రణ చట్టం తెస్తామంటూ మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్.. తల్లిదండ్రులపై పిల్లల చదువుల భారాన్ని తగ్గిస్తుందా?.. ఫీజుల నియంత్రణ చట్టాన్ని తెస్తుందా?.. రాష్ట్రంలో ఫీజుల దోపిడీపై కలం 360 డిగ్రీస్ స్పెషల్..


- తెలంగాణ బ్యూరో, కలం




## ప్రస్తుతం తెలంగాణలో ఫీజులు ఇలా(సగటున)..

(ఉపాధ్యాయ సంఘాల సమాచారం ఆధారంగా..)

| స్కూల్/కాలేజీ కేటగిరీ | ప్రీ ప్రైమరీ | ప్రైమరీ టు హైస్కూల్ | ఇంటర్ | డిగ్రీ |
|---|---|---|---|---|
| బడ్జెట్ | 30,000–80,000 | 50,000–1,50,000 | 30,000–80,000 | 20,000–60,000 |
| మీడియం | 80,000–1,50,000 | 1,50,000–3,00,000 | 80,000–2,00,000 | 60,000–2,00,000 |
| ప్రీమియం | 1,50,000–3,00,000 | 2,00,000–10,00,000 | 2,00,000–5,00,000 | 2,00,000–5,00,000 |

## తెలంగాణలోనే అత్యధిక ఫీజులు

దేశవ్యాప్తంగా తెలంగాణలోనే అత్యధిక ఫీజులు ఉన్నాయని స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తేల్చింది. వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి గణాంకాలతో సహా ఫీజుల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. 'తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల ఫీజు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ యాక్ట్–2025' ముసాయిదా బిల్లును అందజేసింది.

- పదేళ్ల కింద తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో సగటున యాన్యువల్ ఫీజు రూ.50 వేలు. ఇప్పుడది ఏకంగా రూ.1.90 లక్షలకు చేరింది. పదేళ్ల కింద ఫీజుల విషయంలో ఢిల్లీ ఫస్ట్ ప్లేసులో ఉండగా, ఇప్పుడు తెలంగాణ మొదటి స్థానంలో ఉంది.
- రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ఏటా 10–30 శాతం ఫీజులు పెంచుతున్నాయి.



## గత పదేళ్లలో ఫీజుల పెంపు ఇలా..

(విద్యాశాఖ ముసాయిదా– 2025 ఆధారంగా..)

| విద్యా సంవత్సరం | తెలంగాణ | ఉత్తరప్రదేశ్ | తమిళనాడు | ఆంధ్రప్రదేశ్ | ఢిల్లీ |
|---|---|---|---|---|---|
| 2015–16 | 10–30% (50,000) | 5–10% (35,000) | 5–8% (40,000) | 5–10% (38,000) | 8–12% (60,000) |
| 2017–18 | 10–15% (63,000) | 5–10% (42,000) | 5–8% (47,000) | 5–10% (45,000) | 8–12% (75,000) |
| 2020–21 | 5–10% (88,000) | 3–8% (55,000) | 3–6% (60,000) | 3–7% (58,000) | 5–8% (95,000) |
| 2022–23 | 10–20% (1,20,000) | 8–12% (70,000) | 6–8% (75,000) | 8–12% (75,000) | 8–10% (1,20,000) |
| 2024–25 | 10–30% (1,65,000) | 10–12% (85,000) | 6–10% (90,000) | 10–15% (95,000) | 10–12% (1,45,000) |
| 2025–26 | 10–15% (1,90,000) | 10–15% (95,000) | 8–10% (1,00,000) | 10–15% (1,05,000) | 10–15% (1,60,000) |



## ఫీజులు పెంచిన స్కూళ్ల సంఖ్య, వాటిల్లో ఫీజు


| కేటగిరీ | స్కూల్స్ సంఖ్య (దాదాపు) | ఫీజు (రూ.ల్లో) (సంవత్సరానికి) |
|---|---|---|
| బడ్జెట్ స్కూల్స్ | 6,500–7,500 | 15,000–55,000 |
| మిడిల్ క్లాస్ | 3,500–4,500 | 35,000–1,20,000 |
| హైఎండ్ | 250–350 | 1,50,000–2,50,000 |
| ప్రీమియం | 40–60 | 2,50,000–7,00,000 |
| టాప్ ఎండ్ | 15–20 | 5,00,000–10,50,000 |

(విద్యాశాఖ ముసాయిదా ఆధారంగా..)

## స్కూల్ ఎడ్యుకేషన్ సిఫార్సులు ఇవీ..

- ప్రతి రెండేళ్లకు 8% వరకు ఫీజు పెంపుకు అనుమతించాలి.
- పాఠశాల స్థాయి ఫీజు కమిటీ (ఎస్ఎల్ఎఫ్‌సీ), జిల్లా ఫీజు నియంత్రణ కమిటీ (డీఎఫ్ఆర్‌సీ), రాష్ట్ర ఫీజు నియంత్రణ కమిషన్ (ఎస్ఎఫ్ఆర్‌సీ) ఏర్పాటు చేయాలి.
- ఎస్ఎఫ్ఆర్‌సీ చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ హైకోర్టు జడ్జి, వైస్ చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్, సభ్యులుగా స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, చార్టర్డ్ అకౌంటెంట్, ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీతో పాటు ఇద్దరు ప్రముఖ విద్యావేత్తలతో కలిపి మొత్తం 8 మంది ఉండాలి.
- డీఎఫ్ఆర్‌సీ చైర్‌పర్సన్‌గా కలెక్టర్, సభ్యులుగా డీఈవో, జిల్లా ట్రెజరీ ఆఫీసర్/ఆడిట్ ఆఫీసర్ ఉండాలి.
- ఎస్ఎల్ఎఫ్‌సీ చైర్‌పర్సన్‌గా స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి, కన్వీనర్‌గా హెడ్మాస్టర్, సభ్యులుగా ముగ్గురు ఉపాధ్యాయులు, ఐదుగురు స్టూడెంట్ల తల్లిదండ్రులు ఉండాలి.
- ప్రతి స్కూల్ అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు మాత్రమే తీసుకోవాలి. ట్రాన్స్‌పోర్ట్, ఫుడ్ ఫెసిలిటీ ఆప్షనల్‌గా ఉండాలి. విరాళాలు, క్యాపిటేషన్ ఫీజు, మెయింటెనెన్స్ ఫీజులు వసూలు చేయడానికి వీల్లేదు. యూనిఫామ్, బుక్స్, స్టేషనరీ పేరుతో వ్యాపారాలు చేయడం నిషిద్ధం.

## రకరకాల పేర్లతో దోపిడీ..




తెలంగాణలో నర్సరీ మొదలు పదో తరగతి వరకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు భారీగా ఉన్నాయి. నర్సరీకి ఏ స్కూల్‌లోనూ 30 వేల కంటే తక్కువ లేదు. ఇంటర్నేషనల్ స్కూల్స్ లో అయితే రూ.3 లక్షల వరకు తీసుకుంటున్నారు. ఇది కేవలం ట్యూషన్ ఫీజు. దీనికి అదనంగా అడ్మిషన్ ఫీజు, యాక్టివిటీస్ ఫీజు ఉంటుంది. ఫేమస్ స్కూల్స్ అయితే డొనేషన్ కూడా కట్టాల్సిందే. యూనిఫామ్, బుక్స్ తప్పనిసరిగా స్కూల్‌లోనే తీసుకోవాలి. బయట కొనుక్కుంటామంటే ఒప్పుకోరు. బుక్స్, యూనిఫామ్‌కు బయట మార్కెట్‌లో తక్కువ ధర ఉన్నప్పటికీ, స్కూల్ మేనేజ్‌మెంట్స్ అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాయి. ఒకవేళ పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్ ఫెసిలిటీ కావాలంటే, స్కూల్ వ్యాన్ ఫీజుల రూపంలోనూ భారీగానే వడ్డిస్తున్నాయి.

## పేరెంట్స్‌పై పెనుభారం..



పిల్లల స్కూల్ ఫీజులు పేరెంట్స్‌కు పెనుభారంగా మారాయి. హైదరాబాద్‌లో ఏ స్కూల్‌లోనూ నర్సరీకి రూ.30 వేల నుంచి 50 వేలకు తక్కువ లేదు. కార్మికులు, ఆటో డ్రైవర్లు, గిగ్ వర్కర్లు, ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లు ఇంత ఫీజులు ఎలా కట్టగలరు? ఒక్క పిల్లాడిని నర్సరీ నుంచి పదో తరగతి దాకా చదివించాలంటే ఆడపిల్ల పెళ్లి చేసిన దానికంటే ఎక్కువగా ఖర్చవుతున్నదని పేరెంట్స్ వాపోతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలోనే అధిక ఫీజులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్కూల్ ఫీజులను నియంత్రించాలని వేడుకుంటున్నారు.

## ఇప్పటికీ చట్టం లేదు..




ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రస్తుతం తెలంగాణలో ఎలాంటి చట్టం అమల్లో లేదు. ఎన్నికల టైమ్‌లో పార్టీలు హామీలివ్వడం, ఆ తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించడానికి ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టింది. విద్యారంగంలో సంస్కరణలు తేవాలని సిఫార్సులు చేస్తూ విద్యా కమిషన్ ఇప్పటికే 'తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ–2026' రూపొందించింది. స్కూల్ ఫీజుల నియంత్రణకు సంబంధించి స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన డ్రాఫ్ట్ బిల్లునూ అందులో పొందుపరిచింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరో రెండు నెలల్లోనే కొత్త విద్యా సంవత్సరం మొదలుకానున్నది. అంతలోపు సర్కార్ చట్టం తీసుకొస్తుందా? లేదా? అని పేరెంట్స్‌లో ఆందోళన నెలకొన్నది.




# నర్సరీ చదువులకు ఆస్తులు అమ్ముకోవాల్సిందే!

## రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు వసూలు.. వివిధ రకాల ఫీజుల పేరిట దోపిడీ

ఒకప్పుడు చదువు చెప్పడం అంటే పవిత్ర కార్యం. కానీ నేడు చదువు ఓ వ్యాపారం. కొత్త కొత్త పేర్లు చెప్పి తల్లిదండ్రుల వద్ద నుంచి లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నాయి ప్రైవేటు విద్యాసంస్థలు. నర్సరీ వంటి క్లాసులకు రూ. 50 వేల నుంచి లక్ష వరకు దోచుకుంటున్నాయి. కాస్త పేరున్న స్కూళ్లలో అయితే సీటు దక్కించుకోవాలంటే రూ.2 లక్షల వరకు ఖర్చు.

- ఫీజులను బట్టి స్కూళ్లు 3 కేటగిరీలు. టాప్ కేటగిరిలో ఉండే స్కూల్స్ లో ఫీజులు రూ.లక్షల్లోనే. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ఇతర ఫీజుల పేరిట సుమారు రూ.60 వేల నుంచి 80 వేల వరకు వసూలు చేస్తున్నారు. వీటితో పాటు రవాణా చార్జీ (బస్సు) కింద నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి 20 వేల పైనే. పుస్తకాల కోసం రూ.4 వేల నుంచి 8 వేలు, యూనిఫామ్ కోసం రూ.4 వేల నుంచి 6 వేలు. ఇతర యాక్టివిటీస్ పేరిట మరో 6 వేలు.




మొత్తంగా చూసుకుంటే పేరొందిన స్కూల్స్‌లో నర్సరీకి కనీసం రెండు లక్షల పైనే వసూలు చేస్తున్నాయి. ఆ స్కూల్స్‌లో ఉండే ఏసీ, ఇతర సదుపాయాలను బట్టి అదనంగా మరో రూ.40 వేల దాకా నిర్వాహకులు రాబడుతున్నారు.


- రెండో కేటగిరీకి చెందిన స్కూల్స్‌లో నర్సరీ విద్యార్థికి అడ్మిషన్ ఫీజు, ఇతర ఫీజులు కలిపి ఏడాదికి రూ.50 వేల నుంచి 80 వేలు. ఈ స్కూల్స్‌లో కూడా పుస్తకాలకు, రవాణా ఖర్చులకు, యూనిఫామ్‌కు మరో రూ.40 వేల నుంచి 50 వేల వరకు ఖర్చు. ఏడాదికి మొత్తం రూ.లక్షన్నర పైనే.

- మూడో కేటగిరీకి చెందిన స్కూల్స్ లో అడ్మిషన్స్, ఇతర ఫీజులు కలిపి ఏడాదికి రూ.30 వేల నుంచి 50 వేలు. పుస్తకాలు, యూనిఫామ్, ఇతర ఖర్చులకు కలిపి మరో రూ.30 వేలు.

- నర్సరీ చదివించాలంటే సాధారణ, మధ్య తరగతి ప్రజలు కనీసం రూ.80 వేలు వెచ్చించాల్సి వస్తోంది. తరగతిని బట్టి ఫీజులు మారుతుంటాయి. ఒక్కో క్లాస్ పైకి వెళ్తున్న కొద్దీ అదనంగా 20 శాతానికి పైగా చెల్లించాల్సి ఉంటుంది.

### యూకేజీ ఫీజు రూ.2.25 లక్షలు..

ఓ స్కూల్ మేనేజ్‌మెంట్ యూకేజీ స్టూడెంట్‌కు రూ.2.25 లక్షల ఫీజు వసూలు చేస్తున్నది. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. రూ.2.25 లక్షల ఫీజులో.. ట్యూషన్ ఫీజు, లైబ్రరీ ఫీజు తదితర కలిపి రూ.2,24,718. దీనికి అదనంగా అడ్మిషన్ ఫీజు రూ.15 వేలు, కాషన్ మనీ కింద రూ.33 వేలు.



SENIOR KG

| ONE TIME FEE DURING THE ADMISSION | |
|---|---|
| Admission Fee (Non-Refundable) | Rs. 15,000/- |
| Caution Money (Refundable) | Rs. 33,000/- |
| Total | Rs. 48,000/- |
| **School Fees**<br>School Tuition Fee<br>Library fees<br>Gymkhana fee | Rs. 224,718- |

The Total Fee is necluting of school shoes and socks, cafeteria.
Mode of Payment: Cheque/Demand Draft/C... Online Transfer and, Only cash is not ... None. Admission Fees & Sa... Non-Transferable.

### నెటిజన్స్ ఫైర్

యూకేజీలో పిల్లలకు నేర్పేది కేవలం చదవడం, లెక్కలు, సామాజిక నైపుణ్యాలు మాత్రమే. ఆ మాత్రం దానికే రూ.2 లక్షలకు పైగా ఫీజు వసూలు చేయడం ఏంటని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని "చట్టబద్ధమైన దోపిడీ"గా అభివర్ణిస్తున్నారు. "మెట్రో నగరాల్లో ఈ విధమైన బహిరంగ దోపిడీ కొనసాగుతోంది. ఈ ఫీజులు కేవలం టాప్ 1 శాతం మంది మాత్రమే భరించగలరు. మిగతా 99 శాతం ప్రజలు నాణ్యమైన విద్య లేదా రోజువారీ ఖర్చుల మధ్య రాజీ పడాల్సిందే. అయినా సరే ఈ దోపిడీ ఆగదు. ఇవి రాజకీయ నాయకుల చేతుల్లోనే నడుస్తున్నాయి" అంటూ ఓ యూజర్ ట్వీట్ చేశారు. "యూకేజీకి సంవత్సరానికి రూ. 2.25 లక్షల ఫీజు అంటే ఆశ్చర్యంగా అనిపించొచ్చు. కానీ పెద్ద నగరాల్లోని ఇతర ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ఇది తక్కువే. ప్రీమియం మెట్రో స్కూల్స్ సాధారణంగా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా కూడా వసూలు చేస్తాయి. అందుకే ఇది ఇప్పుడు తక్కువ ఫీజులానే కనిపిస్తోంది" అని మరో యూజర్ పేర్కొన్నారు.

### కట్టడి చేయాల్సిందే: హైకోర్టు



ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ (హెచ్‌ఎస్పీఏ) తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. అడ్మిషన్ సమయంలో ప్రైవేట్ పాఠశాలలు రూ. 7 లక్షల వరకు డొనేషన్లు (క్యాపిటేషన్ ఫీజు) వసూలు చేస్తున్నాయని 2016 జులైలో తొలి పిటిషన్ ఫైల్ చేసింది. దీనిపై స్పందించిన హైకోర్టు.. పాఠశాలల ఫీజులపై నియంత్రణ ఉండాలని అభిప్రాయపడింది. 2017–18లో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీని వేసింది. అయితే ఆ కమిటీ నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. కరోనా తర్వాత భారీగా ఫీజులు పెంచడాన్ని సవాల్ చేస్తూ హెచ్‌ఎస్పీఏ 2021లో మరోసారి పిటిషన్ వేసింది. గతంలో హైకోర్టు ఈ పిటిషన్లను విచారించి, ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ఒక సమగ్ర విధానాన్ని లేదా చట్టాన్ని తీసుకురావాలని ఆదేశించింది. ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. స్కూల్ ఫీజుల నియంత్రణపై తుది తీర్పు ఇంకా వెలువడలేదు. కోర్టు పలుమార్లు ప్రభుత్వాన్ని నివేదికలు కోరడం, ప్రభుత్వం కమిటీలను వేయడం వంటివి జరుగుతున్నాయి. కానీ, తల్లిదండ్రులు ఆశించిన విధంగా ఫీజుల నియంత్రణ చట్టం ఇంకా కార్యరూపం దాల్చడం లేదు.

### ప్రైవేటుకు వెళ్లడం ప్రభుత్వ వైఫల్యమే



ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోంది. కొన్ని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల కంటే ఇది ఎక్కువే. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ప్రతిభావంతులైన, క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. అయినప్పటికీ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపడం బాధాకరం. దాదాపు 11 వేల ప్రైవేట్ స్కూళ్లలో 34 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 18 లక్షల మంది మాత్రమే ఉండటం ప్రభుత్వ వైఫల్యమే. ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో కేవలం 6.7% మంది మాత్రమే తమ పాఠ్యపుస్తకాలను సరిగ్గా చదవగల్గుతున్నారు. మిగిలిన 93% మంది కనీసం 3వ తరగతి పుస్తకాలను కూడా చదవలేకపోతున్నారు. కొన్ని చోట్ల కేవలం ఐదుగురు విద్యార్థులు ఉన్న స్కూళ్లలో 9 మంది టీచర్లు ఉన్నారు. ఇలాంటి అసంబద్ధతలను సరిదిద్దాల్సిన అవసరం ఉంది.

**- సీఎం రేవంత్ రెడ్డి**

**(ఇబ్రహీంపట్నంలో ఓ ప్రైవేట్ స్కూల్ ప్రారంభోత్సవంలో కామెంట్)**

### అప్పులు తెచ్చి ఫీజులు కడ్తున్నం

జీతాలు పెరగడం లేదు కానీ, ప్రతి ఏటా స్కూల్ ఫీజులు మాత్రం 25% పెరుగుతున్నాయి. నర్సరీ, యూకేజీ చదువుతున్న ఇద్దరు పిల్లల ఫీజులు, వ్యాన్ చార్జీలు, బుక్స్ అన్నీ కలిపి ఏడాదికి రూ.3 లక్షల నుంచి 4 లక్షలు అవుతున్నాయి. చేతిలో నగదు లేక గతేడాది పర్సనల్ లోన్ తీసుకున్నాను. ఇప్పుడు ఆ లోన్ ఈఎంఐలు కట్టడమే సరిపోతోంది. పిల్లల చదువు కోసం అప్పుల ఊబిలోకి వెళ్తున్నాం.

**- మాధవి, హైదరాబాద్**

### ఫస్ట్ క్లాస్‌కే రూ.లక్షన్నర

ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం లేక పిల్లలను ప్రైవేటుకు పంపిస్తున్నాం. కానీ అక్కడ కేవలం ఏసీ క్లాస్‌రూమ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ పేరుతో లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఫీజు కట్టడం ఆలస్యమైతే పిల్లలను క్లాసు బయట నిలబెడుతున్నారు. ఫీజుల నియంత్రణ కమిటీలు ఏమయ్యాయో అర్థం కావడం లేదు. ఫస్ట్ క్లాస్ కోసం ఏడాదికి రూ.1.50 లక్షలు కడ్తున్నాం.

**- చందన, నిర్మల్**

# అడ్డగోలు ఫీజులపై పేరెంట్స్ ఆవేదన

ఏటా ప్రైవేట్ స్కూళ్లు ఇష్టమున్నట్టుగా ఫీజులను పెంచుతున్నాయని పేరెంట్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్ల దోపిడీ మరీ ఎక్కువైందని అంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లు 30% నుంచి 50% వరకు ఫీజులు పెంచుతున్నాయని తాజాగా హైదరాబాద్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ (హెచ్ఎస్పీఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టం తెస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నా.. అది కమిటీల వరకే ఆగిపోతున్నదని పేరెంట్స్ అంటున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్, షేక్‌పేట ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి 50% వరకు ఫీజులు పెంచడంతో తల్లిదండ్రులు ఈ మధ్య ఆందోళనకు దిగారు. స్కూళ్ల ముందు నిరసన తెలిపారు. రూ.76వేలు ఉన్న ఫీజు ఇప్పుడు లక్ష రూపాయల వరకు పెంచుతున్నారని.. ఇంతకన్నా దోపిడీ ఏముంటుందని వాపోయారు. కొన్ని తరగతులకు ఫీజు ఏకంగా రూ.3.2 లక్షలకు చేరిందని, నాలుగేండ్లలో ఫీజులు 141% పెరిగాయని వారు లెక్కలతో మీడియా ముందుకు వచ్చారు. సంగారెడ్డి జిల్లా బీర్గుడాలోని ఒక ప్రైవేట్ పాఠశాల ఎదుట తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. ట్యూషన్ ఫీజుతో పాటు బుక్స్, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.




ఫీజులు తగ్గించాలని హైదరాబాద్‌లోని ఓ స్కూల్ ముందు ఇటీవల పేరెంట్స్ ధర్నా

## సంపన్నుడికి వ్యాపార సామ్రాజ్యం

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే క్రమశిక్షణకు మారుపేరు.. అక్కడి నుంచి వచ్చిన వారే నేడు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా దేశాన్ని ఏలుతున్నారు. కానీ, సరిగ్గా రెండు దశాబ్దాల కాలంలో విద్యా వ్యవస్థ పూర్తిగా తలకిందులైంది. నాడు పైసా ఖర్చు లేకుండా సాగిన చదువు.. నేడు సామాన్యుడికి అందని ద్రాక్షగా.. సంపన్నుడికి వ్యాపార సామ్రాజ్యంగా మారిపోయింది. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆవేదన వ్యక్తం చేసినట్లుగా ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై ఏడాదికి లక్ష రూపాయలకు పైగా వెచ్చిస్తున్నా, అత్యంత అర్హులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నా.. తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపేందుకు ససేమిరా అంటున్నారు.

## ప్రైవేటు స్కూల్.. 'స్టేటస్ సింబల్'

ప్రైవేటు స్కూల్‌అనేది నేటి సమాజంలో 'స్టేటస్ సింబల్'గా మారిపోయింది. దీని వెనుక కేవలం నాణ్యమైన విద్య మాత్రమే లేదు.. అంతకుమించిన సామాజిక ఒత్తిడి, కార్పొరేట్ సంస్థల మార్కెటింగ్ మాయాజాలం ఉంది. పక్కింటి వారు లక్షలు పోసి కార్పొరేట్ స్కూల్లో చేర్పిస్తే, తాము ప్రభుత్వ బడికి పంపిస్తే తమ పరువు పోతుందన్న భయం, పిల్లల భవిష్యత్తు ఎక్కడ వెనుకబడిపోతుందో అన్న ఆందోళన మధ్యతరగతి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెడుతున్నది. రూపాయి ఆదాయం పెరగకపోయినా, స్కూల్ ఫీజులు మాత్రం ఏటా 15 శాతం పెరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా ఫీజులు కట్టేందుకు తల్లిదండ్రులు పర్సనల్ లోన్లు, క్రెడిట్ కార్డులు, ఈఎంఐల మీద ఆధారపడుతున్నారు.



## ప్రైవేట్ స్కూళ్లు 29%.. విద్యార్థులు 60%

తెలంగాణ సోషియో ఎకనామిక్ సర్వే –2026 ప్రకారం రాష్ట్రంలో మొత్తం స్కూళ్లు 39,641. ఇందులో 11,689 ప్రైవేట్ బడులు. మిగతా 27,952 స్కూళ్లు ప్రభుత్వ పరిధిలోనివి. అన్ని బడుల్లో కలిపి 62 లక్షల 36వేల మంది విద్యార్థులు ఉండగా.. ఇందులో ప్రైవేటులోనే 37,43,893 మంది చదువుతున్నారు. మిగతా 24,92,107 మంది మాత్రమే సర్కార్ స్కూళ్లలో విద్యనభ్యసిస్తున్నారు. సర్కార్ స్కూళ్లు ఎక్కువగా ఉన్నా.. ప్రైవేట్ స్కూళ్లు తక్కువగా ఉన్నా.. తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలను ప్రైవేట్ లోకే పంపుతున్నారు.

- మొత్తం స్కూళ్లలో ప్రభుత్వ స్కూళ్ల శాతం 70.51. ప్రైవేట్ స్కూళ్ల శాతం 29.49. మొత్తం విద్యార్థుల్లో ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న వారి శాతం 39.96. ప్రైవేట్ లో చదువుతున్నవారి శాతం 60.04.
- పదేండ్లలో తెలంగాణలో ప్రభుత్వ బడుల నుంచి సుమారు 8 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు మారినట్లు లెక్కలు చెప్తున్నాయి.
- 2024-25లో 1,441 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేదు (జీరో అడ్మిషన్).

## కృత్రిమ వెలుతురులో స్టడీ

ప్రైవేట్ విద్యాసంస్థలు వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ, కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా విద్యార్థులను గదుల్లో కుక్కుతున్న తీరు విస్మయానికి గురి చేస్తున్నది. అగ్గిపెట్టెల్లాంటి గదులు, అసలు గాలి ఆడని వాతావరణం, రాత్రి పగలు తేడా తెలియని కృత్రిమ వెలుతురులో వందలాది మంది విద్యార్థులను కూర్చోబెట్టి కేవలం ర్యాంకుల యంత్రాలుగా మారుస్తున్నారు. ఒక్కో బెంచీపై పరిమితికి మించి విద్యార్థులను కూర్చోబెట్టడంతో వారు శారీరకంగానే కాకుండా, మానసికంగా కూడా తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

- చాలా కాలేజీలకు కనీస ఆటస్థలాలు లేవు. వ్యాయామం అన్న మాటే వినిపించదు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా సాగే క్లాసులు, స్టడీ అవర్ల పేరుతో విద్యార్థుల వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నారు. కనీసం కిటికీలు కూడా లేని గదుల్లో గంటల తరబడి కూర్చోవడంతో విద్యార్థులు శ్వాసకోశ ఇబ్బందులతో పాటు కంటి చూపు సమస్యలను కూడా ఎదుర్కొంటున్నారు. 'ర్యాంకు వస్తేనే నీకు విలువ.. లేదంటే నువ్వు వేస్ట్' అనే విషపూరితమైన ఆలోచనను వారి మెదళ్లలోకి ఎక్కించి, వారిని నిరంతరం భయాందోళనలో ఉంచుతున్నారు.




## కాలేజీలు @ చెరసాలలు

తెలంగాణలో కార్పొరేట్ జూనియర్ కాలేజీలు.. పసిప్రాణాలను పిప్పి చేసి కాసులు కురిపించే కబేళాలుగా మారిపోయాయి. ముక్కుపచ్చలారని విద్యార్థులను ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు నాలుగు గోడల మధ్య బందీలుగా ఉంచి, ర్యాంకుల వేటలో వారి మెదళ్లను మొద్దుబారుస్తున్నాయి. ఒక్కో అడుగుకూ ఒక్కో ఫీజు.. అడ్మిషన్ దగ్గర మొదలై బుక్స్, హాస్టల్, స్పెషల్ క్లాసుల పేరుతో సామాన్యుడి రక్తాన్ని ఫీజుల రూపంలో జుర్రుకుంటున్న ఈ విద్యా మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. దురదృష్టవశాత్తూ ఆ ఒత్తిడిని భరించలేక ఏ విద్యార్థి అయినా తనువు చాలిస్తే, ఆ శవం బయటకు రాకుండానే ధనబలంతో నిజాలను పాతిపెడుతున్నాయి. తల్లిదండ్రుల కన్నీటి కంటే, తమ కాలేజీ బ్రాండ్ ఇమేజ్ ముఖ్యం అనుకునే ఈ పైశాచిక మేనేజ్మెంట్లకు రాజకీయ అండదండలు తోడవ్వడం విచారకరం.